క్లుప్తంగా

పంట నష్టం సర్వే చేయాలని వినతి



ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

పెంచికల్‌పేట్: ప్రాణహిత వరదలతో నష్టపోయిన పంటలను వెంటనే సర్వే చేయాలని కోరుతూ మండల కేంద్రంలోని రైతువేదికలో ఏవో మనీషాకు రైతులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ వరదలతో కమ్మర్‌గాం, మురళీగూడ, జిల్లెడ, నందిగామ గ్రామాల్లో సుమారు నాలుగు వందల ఎకరాల్లో పంటలు నీట మునిగాయన్నారు. వెంటనే సర్వే చేసి రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

గోరింటాకు సంబరాలు



రామాలయంలో గోరింటాకు సంబరాలు

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్కపల్లి రామాలయంలో ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో ఆషాఢమాస గోరింటాకు సంబరాలు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. అంతకు ముందు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మహిళా మండలి సభ్యులు, తది తరులు పాల్గొన్నారు.

జొన్న, కంది విత్తనాలు పంపిణీ



పంపిణీ చేస్తున్న ఏవో యుగేందర్

కెరమెరి: మండలంలోని కేస్లాగూడ రైతువేదికలో మంగళవారం వ్యవసాయాధికారి యుగేందర్ రైతులకు జొన్నలు, కంది విత్తనాలు పంపిణీ చేశారు. మండలానికి కందులు 5.84 క్వింటాళ్లు, జొన్నలు 1.40 క్వింటాళ్లు మంజూరైనట్లు తెలిపారు. ఆసక్తి గల రైతులు ఆధార్ కార్డు, పట్టా పాస్ పుస్తకం జిరాక్స్ కాపీలు సమర్పించి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో స్వేత, ప్రభావతి, తదితరులు పాల్గొన్నారు.

'జీవో 49 రద్దు చేయాలి'



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: గ్రామాలను, అడవిని కార్పొరేట్‌కు అప్పగించే జీవో 49 రద్దు చేయాలని సీపీఎం నాయకులు దినకర్ అన్నారు. మంగళవారం మన్కపూర్‌లో ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులులు, అడవుల సంరక్షణ పేరుతో ఖాళీ చేయించే కుట్రను మానుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు టీకానంద్, కార్తీక్, చందు, రాము, లచ్చుబాయి, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల గడువు పెంపు

చింతలమానెపల్లి: మండల కేంద్రంలోని కస్తూరిబా విద్యాలయంలో ఉద్యోగాల దరఖాస్తులకు గడువు పెంచుతున్నట్లు ఎంఈవో జయరాజ్ తెలిపారు. కస్తూరిబా విద్యాలయంలో అసిస్టెంట్ కుక్, నైట్ వాచ్‌మెన్ ఉద్యోగాల భర్తీ కోసం దరఖాస్తులు అందజేసే గడువును ఈనెల 18వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు తెలిపారు. అసిస్టెంట్ కుక్ ఉద్యోగానికి 7వ తరగతి, నైట్‌వాచ్‌మెన్ ఉద్యోగానికి 10వ తరగతి చదివి ఉండాలని సంబంధిత పత్రాలతో కస్తూరిబా విద్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు.

బదిలీలతో కూడిన పదోన్నతులు ఇవ్వాలి

చింతలమానెపల్లి: ప్రభుత్వం ఉపాధ్యాయులకు బదిలీలతో కూడిన పదోన్నతులు ఇవ్వాలని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చునార్కర్ సునీల్ కుమార్ అన్నారు. మంగళవారం మండలంలో సంఘం సభ్యత్వ నమోదు నిర్వహించారు. మండలంలోని బాబాసాగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడు తూ సంఘం ఆధ్వర్యంలో ఎన్నో పోరాటాలు నిర్వహించామన్నారు. ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను నెరవేర్చేలా ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు దెబ్బటి సత్యనారాయణ, సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు కుర్మదాస్, విలాస్, ఉపాధ్యక్షులు మ హేందర్, నాయకులు రమేశ్, అనిల్‌లు పాల్గొన్నారు.

నిధులు లేక.. నిర్మాణం పూర్తి కాక!

- పాత భవనంలోనే కొనసాగుతున్న తరగతులు
- వర్షాకాలంలో విద్యార్థులకు తప్పని తిప్పలు



వరండాలో కొనసాగుతున్న తరగతులు



అర్ధంతరంగా నిలిచిన నూతన పాఠశాల భవన నిర్మాణ పనులు

కెరమెరి: పాఠశాల భవన నిర్మాణం ప్రారంభమైందని.. ఇక వచ్చే ఏడాది నూతన పాఠశాలలోకి వెళ్తే తమ కష్టాలు దూరమవుతాయని సంబరపడ్డ విద్యార్థులకు గుత్తేదారు అర్ధంతరంగా పనులు నిలిపివేయడంతో నిరాశే మిగిలింది. మండలంలోని పునరావాస కేంద్రమైన రాంజీగూడ ఆశ్రమ ఉన్నత పాఠశాల శిథిలావస్థకు చేరింది. ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి. పాఠశాలలో నాలుగో తరగతి నుంచి పదో తరగతి వరకు 109 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. గతేడాది సెప్టెంబర్‌లో రూ.75 లక్షల నిధులతో ధనోర గ్రామం వద్ద ఉన్న పునరావాస కేంద్రంలో నూతన భవన నిర్మాణం పనులు ప్రారంభించారు. ఇప్పటికీ డోర్ లెవల్ వరకు నిర్మాణం పూర్తయ్యింది. ఇప్పటి వరకు గుత్తేదారుకు సుమారు రూ.35 లక్షల వరకు వెచ్చించారు. కానీ నేటికీ ప్రభుత్వం చెల్లించకపోవడంతో ఉన్నఫలంగా పనులు నిలిపివేశారు. వాస్తవానికి ఈ ఏడాది జూన్‌లోనే ప్రారంభం కావాల్సి ఉండగా నిధులు మంజూరు కాకపోవడంతో పరిస్థితి తారుమారైంది.

సరిపడని తరగతి గదులు

ఆ పాఠశాలలో మొత్తం ఎనిమిది గదులు ఉన్నాయి. ఆరు గదుల్లో విద్యాబోధన కొనసాగుతుంది. ఒక్కో తరగతి గదిలో రెండేసీ తరగతులు బోధిస్తుండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఒక తరగతికి బోధిస్తుండగా మరో తరగతి విద్యార్థులు ఆరుబయటకు వెళ్లాల్సిన పరిస్థితి. దీంతో కొన్ని తరగతులు వరండాలో కొనసాగిస్తున్నారు. తరగతి గదులు, హాస్టల్ రెండూ ఒకే చోట ఉన్నాయి. వర్షం కురిస్తే తడుస్తూ భోజనం వడ్డించాల్సిన పరిస్థితి. ఈ విషయమై ఐటీడీఏ ఏఈ నజీమొద్దీన్‌ను వివరణ కోరగా ధనోరా వద్ద పాఠశాల భవనం నిర్మిస్తున్న గుత్తేదారుకు రూ.35 లక్షలు వెచ్చించారు. కానీ రూపాయి కూడా అందక పోవడంతో చేతిలో డబ్బు ల్లేక భవన నిర్మాణం నిలిచింది. నిధులు విడుదల కాగానే పనులు ప్రారంభిస్తాం.

త్వరగా పూర్తి చేయాలి



తరగతి గదులు చాలడం లేదు. క్లాసులు, హాస్టల్ ఒకేచోట ఉన్నాయి. అందుకు స్థలం కూడా ఇబ్బందిగా మారింది. వర్షం కురిస్తే భయమేస్తోంది. చదువుపై ఏకాగ్రత పెట్టలేకపోతున్నాం. నూతన భవన నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి. – గురుదాస్, విద్యార్థి, పదోతరగతి

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ



చెక్కులు అందజేస్తున్న బీజేపీ నాయకులు

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్కపల్లి గ్రామానికి చెందిన సారంపల్ల మల్లేశ్‌కు రూ. 15500, దుబ్బుల రాజన్నకు రూ. 32000, జునుగరి గంగుకు రూ. 17500, పోతెపల్లి గ్రామానికి చెందిన చౌదరికి అంజయ్యకు రూ. 21500, గొంట్లపేట్ గ్రామానికి చెందిన మండిగ శ్రీకాంత్‌కు రూ. 27000 సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు మంజూరు కాగా బీజేపీ నాయకులు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కుకిడే రాజేశ్వర్, జునుగరి మధుకర్, చప్పిడే సత్యనారాయణ, నాగన్న, ప్రభాకర్, రాజన్న, భాస్కర్, వెంకన్న, కాంతారావు, శ్రీనివాస్, ప్రభా కర్, పెద్ది సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ కార్యవర్గం ఎన్నిక



మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు

దహెగాం: మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎస్‌ఎఫ్‌ఐ నూతన కమిటీని జిల్లా అధ్యక్షుడు సాయికుమార్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా చాపిలె అంజలి, కార్యదర్శిగా ఈశ్వర్, ఉపాధ్యక్షులుగా కిరణ్, అంజలి, అంజన్న, సహాయ కార్యదర్శులుగా పుష్పాంజలి, మీనా, కార్తీక్, కమిటీ సభ్యులుగా సిద్దార్థ్, అక్షిత్, బాలేష్‌లతో పాటు మరికొంత మందిని ఎన్నుకున్నారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు సాయికుమార్ మాట్లాడుతూ విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. కళాశాల క్రీడా మైదానంలో వర్షపు నీరు నిల్వ ఉండడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు సుంకరి సాయి తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో కుక్కల బెడద



కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్‌లో కుక్కల బెడదతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్ గుండా జిల్లాలోని పలు మండలాల ప్రజలు ప్రయాణిస్తుంటారు. కాగా రైల్వేస్టేషన్‌లో కుక్కలు స్వైర విహారం చేస్తూ ప్రయాణికులను భయాందోళనకు గురి చేస్తున్నాయి. అధికారులు స్పందించి కుక్కలు స్టేషనలోకి రాకుండా నివారించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

బెంబేలెత్తిస్తున్న కోతులు!



దహెగాం: మండల కేంద్రంలో కోతుల బెడద రోజురోజుకూ తీవ్రతరమవుతోంది. కోతులు ఇళ్లు పీకి పందిరి వేస్తునాయి. ఇళ్లలోకి చొరబడి వస్తువులను ఎత్తుకెళ్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్లపై వర్షానికి ఉరవకుండా కప్పుకున్న టార్పాలిన్ కవర్లు చింపేస్తున్నాయని వాపోతున్నారు. రోడ్లపై గుంపులుగా సంచరిస్తుండడంతో చిన్నపిల్లలు రోడ్లపైకి రావడానికి జంకుతున్నారు. అధికారులు స్పందించి కోతుల బెడద నుంచి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

గిరిజనుల అభివృద్ధికి 'ధరితీ ఆబ'

కెరమెరి: గిరిజనుల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ఇటీవల 'ధరితీ ఆబ' పథకం ప్రవేశపెట్టిందని సీఆర్‌టీ శంకర్ అన్నారు. మంగళవారం మండలంలోని రాంజీగూడ పాఠశాలలో పథకంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌టీలు గోపాల్, ప్రవీణ్‌కుమార్, జలపతి, క్రిష్ణ, దేవ్ రావు, అరుణ, భీంరావు పాల్గొన్నారు.

పేకాడుతున్న నలుగురి అరెస్టు

ఆసిఫాబాద్‌రూరల్: పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణా ప్రతాప్ తెలిపారు. మంగళవారం మండలంలోని బుదేల్ ఘాట్ బ్రిడ్జి దగ్గర పేకాట ఆడుతున్న భీమయ్య, ఇమ్రాన్‌ఖాన్, గౌస్ సిద్ధి, పురుషోత్తంను అరెస్టు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. వారి వద్ద నుంచి రూ.6,800 నగదు, మూడు స్మార్ట్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది దేవేందర్, సంజీవ్, స్పెషల్ పార్టీ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గద్దె కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలి

ఆసిఫాబాద్‌రూరల్: దండోరా జెండా గద్దె కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో మంగళవారం కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎస్పీ కాంతిలాల్ పాటిల్‌కు వినతిపత్రం అందజేశారు. ఆ సంఘం నాయకుడు కేశవరావు మాట్లాడుతూ తిర్యాణి మండలం సుంగాపూర్ గ్రామంలో దండోరా జెండా గద్దె నిర్మించుకున్నామని తెలిపారు. గుర్తుతెలియని దుండగుల దానిని కూల్చివేశారన్నారు. దుండగులను గుర్తించి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

'ఓట్ల కోసం గ్రామాల్లో తిరగనివ్వం'

బెజ్జూర్: బెజ్జూర్ నుంచి సోమిని వరకు ప్రధాన రహదారికి మరమ్మతులు చేయకుండా.. ఎవ్వరినీ ఓట్లు కోసం తిరగనివ్వమని సోమిని, పరిసర 12 గ్రామాల ప్రజలు స్పష్టం చేశారు. ఈ మేర కు సోమిని గ్రామంలో సమావేశమై తీర్మానం చేశా రు. రోడ్డు సౌకర్యం సక్రమంగా లేకపోవడంతో 108 అంబులెన్స్ సైతం గ్రామాల్లోకి రాలేని దుస్థితి ఉందన్నారు. రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ఎమ్మెల్యే, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారా నికి నోచుకోవడం లేదన్నారు. మాజీ ఎమ్మెల్యే కోనే రు కోనప్ప దృష్టికి తీసుకెళ్లగా వారం రోజుల్లో మరమ్మతులు చేయిస్తానని తెలియజేశారని పేర్కొన్నా రు. ఆత్రం సాయి, లంగారి శ్రీనివాస్, ఎలాది చంద్రశేఖర్, ఆలం అనిల్, నైతం సత్తయ్య, దందేరా ఇ స్తారి, దుర్గం శంకర్, నైతం రాజు, కొడప మల్లాజీ, అమీరొద్దీన్, ఎర్మ రామన్న, రైతులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టై, బెల్టులు పంపిణీ



టై, బెల్టులతో విద్యార్థులు

కెరమెరి: మండలంలోని లేండిగూడ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం ఎంఈవో ఆడే ప్రకాశ్, కాంప్లెక్స్ హెచ్‌ఎం చంద్రశేఖర్, భరత్‌కుమార్ టై, బెల్టులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పాఠశాల ఏఐ(కత్యాధార బోధన) ప్రోగ్రాంకు ఎంపికైందన్నారు. ఉపాధ్యాయులు చేసిన కృషితో ఇంతకు ముందు ఎస్‌సీఆర్‌టీ ద్వారా బోస్ట్ ప్రాక్టీస్‌కు ఎంపికైందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం క్రాంతికుమార్, ఉపాధ్యాయుడు శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు, రైతులు

రెబ్బెన: గోలేటి ఓసీపీలో ముంపునకు గురయ్యే భూములకు సంబంధించి బాధిత రైతులకు న్యాయం చేయాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులుగౌడ్ అన్నారు. గోలేటి టౌన్‌షిప్‌లో మంగళవారం కేంద్ర సహాయ మంత్రి హర్ష్ మల్హోత్రాను కలిసి వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం బెల్లంపల్లి ఏరియాలో నూతనంగా ప్రారంభించే గోలేటి ఓసీపీలో విలువైన వ్యవసాయ భూముల తోపాటు ఇళ్లను కోల్పోతున్నారని తెలిపారు. ఎకరానికి రూ.60లక్షల పరిహారంతోపాటు సింగరేణిలో శాశ్వత ఉద్యోగం కల్పించాలన్నారు. ఓసీపీ పేరుతో తీసుకుంటున్న భూములకు సింగరేణి యాజమాన్యం భూభారతి ప్రకారం విలువ రూ.20లక్షలు ఉందని పేర్కొన్నారు. ఈ లెక్కన వాస్తవ విలువకు రెండు రేట్లు కలిపి ఒక్కో ఎకరానికి రూ.60లక్షలు చెల్లించాల్సి ఉండగా.. తక్కువ రిజిస్ట్రేషన్ విలువ చూపి కేవలం రూ.7.56 లక్షలు చెల్లించేందుకు అవార్డు ప్రకటించారని ఆరోపించారు. రైతులకు న్యాయం చేయాలని కేంద్ర సహాయ మంత్రిని కోరారు. కార్యక్రమంలో బీజేపీ వన్ నేషన్- వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్ అరిగెల నాగేశ్వర్‌రావు, సోనాపూర్ గ్రామ పటేల్ దొందే రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కృష్ణకుమారి, మాజీ ఎంపీపీ అరిగెల మల్లికార్జున్, బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి సుచిత్, మండల అధ్యక్షుడు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

బోనాల సంబరాలు



బోనాలతో విద్యార్థులు, తల్లిదండ్రులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని వాసవి పాఠశాలలో మంగళవారం బోనాల సంబరాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు బోనాలు ఎత్తుకుని అమ్మవారికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహేశ్వర్, ప్రసాద్, సురేష్, క్రాంతి, అజయ్ పాల్గొన్నారు.

సోమిని పాఠశాల ఆకస్మిక తనిఖీ



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎంఈవో సునీత

బెజ్జూర్: ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేయాలని మండల విద్యాధికారి సునీత అన్నారు. మండలంలోని సోమిని మండల పరిషత్ పాఠశాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని పేర్కొన్నారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని, బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని సూచించారు. ఆమె వెంట ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పంద్రం బిక్షమయ్య, ఆత్రం సాయి, లంగారి శ్రీనివాస్, దుర్గం శంకర్, ఇస్తారి, సత్యం, ఉపాధ్యాయులు ఉన్నారు.

పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచాలి

కౌటాల: ప్రభుత్వ పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచాలని ఎంఈవో గావుడే హన్మంతు అన్నారు. మంగళవారం మండలంలోని కనికి, కుంబారీ, భీవర్ హెట్టి గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని తెలిపారు. మెరుగైన విద్య అందించడంతో పాటు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ ఉంచాలన్నారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలిపారు. ఆయన వెంట ఉపాధ్యాయులు ఉన్నారు.

దినసరి వేతనం అందేలా చూడాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

కాగజ్‌నగర్‌టౌన్: ఉపాధి కూలీలకు దినసరి వేతనం రూ.307 ఉండే విధంగా పనులను ఎంపిక చేసుకోవాలని ఎంపీడీవో కోట ప్రసాద్ సూచించారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వన మహోత్సవం కార్యక్రమంలో ఉన్నతాధికారులు ప్రతిపాదించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. కూలీల హాజరు రెండుసార్లు తీసుకోవాలని, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన కింద కూలీలను నమోదు చేయాలని, రికార్డులు సరిగా నిర్వహించాలన్నారు. సమావేశంలో ఏపీవో చంద్రశేఖర్, టెక్నికల్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రగ్స్ నివారణపై అవగాహన



మాట్లాడుతున్న ఎస్సై కమలాకర్

సిర్పూర్(టి): డ్రగ్స్ నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్సై కమలాకర్ అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో మండలంలోని ప్రధానోపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు డ్రగ్స్ నివారణ చర్యలపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. అనంతరం డ్రగ్స్ నివారణ పోస్టర్లు విడుదల చేశారు. ఎంఈవో వేణుగోపాల్ మాట్లాడుతూ పాఠశాలల్లో సమయపాలన పాటించాలని, పాఠశాల కార్యనిర్వహణ కార్యక్రమాలు, విద్యార్థులకు పంపిణీ చేసే పాఠ్యపుస్తకాలు, దుస్తులు, మధ్యాహ్న భోజన సదుపాయాలు తదితర అన్ని అంశాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఎంపీడీవో సత్యనారాయణ, కాంప్లెక్స్ హెచ్‌ఎం సదాశివుడు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ప్రవీణ్ బాబు

ఆసిఫాబాద్‌రూరల్: మాదకద్రవ్యాల అక్రమ రవాణా ఎదుర్కొనేందుకు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో ప్రహరీ క్లబ్‌లను సమర్థవంతంగా అమలు చేయాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ స్టేట్ కోఆర్డినేటర్ ప్రవీణ్ బాబు మంగళవారం కలెక్టర్ వెంకటేశ్ దోత్రేకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాల నిర్మూల న కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల్లో అందరు భాగస్వాములు కావాలన్నారు. విద్యా సంస్థల్లో కమిటీలు ఏర్పాటు చేసి విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.